రహదారులు తళతళ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి వార్డు, ప్రతి నియోజకవర్గం, కొండవాలు ప్రాంతాలు, మురికివాడలు ఇలా అన్ని ప్రాంతాల్లో కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ముఖ్యంగా మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అందంగా.. నాణ్యంగా రహదారులను నిర్మిస్తున్నారు. దీంతో రోడ్లన్నీ తళతళలాడుతున్నాయి.


ప్రిన్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో నిర్మించిన బీటీ రోడ్డు



డీఎస్ఆర్ అపార్ట్‌మెంట్ లేన్, గ్రీన్ గార్డెన్స్ వద్ద నిర్మించిన సీసీ రోడ్లు

- 53వ వార్డులో కొత్త రోడ్ల నిర్మాణం
- సాఫీగా నడక, వాహనాల రాకపోకలు
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతోనే ఇది సాధ్యమైంది. కొన్నేళ్లుగా ఈ వార్డు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యంగా ఇక్కడి రోడ్లు అధ్వానంగా ఉండేవి. సీఎం వైఎస్ జగన్ విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలో 53వ వార్డులో రోడ్ల నిర్మాణాలు చకచకా జరిగాయి.. జరుగుతున్నాయి.

రూ.3 కోట్ల నిధులతో..

వార్డు పరిధి హైవేలో పంజాబ్ హోటల్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ మధ్య ప్రాంతంలోని ప్రిన్స్ అపార్ట్‌మెంట్, హుస్సేన్‌నగర్, పార్వతీనగర్, డీఎస్ఆర్ అపార్ట్‌మెంట్ ఏరియాల్లోని రోడ్లు, కాలువలు ఘోరంగా ఉండేవి. ఇప్పుడు ఆ ప్రాంతాలకు మహర్దశ పట్టింది. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 కోట్ల నిధులకు సంబంధించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఆయా నిధులతో జీవీఎంసీ అధికారులు పనులు చకచకా జరిపిస్తున్నారు. సీసీ, బీటీ రోడ్లు, కాలువలు ఇలా అన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాడు రాళ్లు తేలిన రహదారులు.. నేడు అద్దంలా మెరుస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


53వ వార్డు నూకాలమ్మ గుడి ప్రాంతంలో నిర్మించిన బీటీ రోడ్డు

బీటీ, సీసీ రోడ్ల వివరాలు..

- మద్రిపాలెం శివనగర్‌లో రూ.18.41 లక్షలతో, హైవే దరి ప్రిన్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో రూ.18.70 లక్షలతో, ఆర్ అండ్ బీ జంక్షన్ దరి నూకాలమ్మ గుడి ప్రాంతంలో రూ.7.10 లక్షలతో, ఎఫ్‌సీఐ పార్కు ప్రాంతంలో రూ.16 లక్షల జీవీఎంసీ నిధులతో అధికారులు బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.
- పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపంలోని అపోలో ఫార్మసీ లేన్‌లో రూ.19.85 లక్షలతో, హుస్సేన్ నగర్ లేన్-2లో రూ.19.80 లక్షలతో, గ్రీన్ గార్డెన్స్‌లో రూ.19.70 లక్షలతో, డీఎస్ఆర్ అపార్ట్‌మెంట్ లేన్‌లో సుమారు రూ.7 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు.
- ప్రస్తుతం జాతీయ రహదారిలో సాయినగర్ నుంచి మద్రిపాలెం మెయిన్ రోడ్డు మసీద్ స్ట్రీట్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. గ్రీన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డుకు సంబంధించి బీటీ రోడ్డు, నరేంద్రనగర్ 296 సచివాలయం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది.

రోడ్లు చాలా బాగున్నాయి



గతంలో రోడ్లు బాగోలేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డు మీద నడవాలంటే రాళ్లు తన్నుకుని పడిపోతామేమో అని భయం ఉండేది. చాలా మంది వాహనాలు నడిపిన వారు ఇబ్బందులు గురయ్యారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కొత్త రోడ్లు నిర్మించడం వల్ల ప్రయాణాలు సాఫీగా సాగిపోతున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– ఎ.లక్ష్మి, పార్వతీ నగర్

ప్రజల ఇబ్బందులు తొలగాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. గతంలో రోడ్లు బాగోలేక వార్డు ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అన్ని చోట్ల కొత్తగా రహదారులు నిర్మించడంతో ప్రయాణికులు, పాదచారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు.

– బాబూరావు, హుస్సేన్ నగర్

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ ఏపీఎస్ఈబీ, 11 కేవీ టీపీటీ కాలనీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్లలో మరమ్మతులు, ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గణేష్‌బాబు హాస్పిటల్, బృందావన్ పార్కు, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, వుడా కాంప్లెక్స్, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మద్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్-2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి 33/11 ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్ స్టేషన్, మద్రిపాలెం వుడా లేఅవుట్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్, మద్రిపాలెం, ప్రభుత్వ ఐటీఐ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, జ్యోతినగర్, గౌతమ్ గార్డెన్స్, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, సంకురుపేట, శ్రీరామ్‌నగర్, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ బర్మా క్యాంప్, మద్రిపాలెం వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ఏరియా, న్యూ కరాస, బీఆర్‌టీఎస్ రహదారి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో నేటి కార్యక్రమాలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం సీతమ్మధారకు చెందిన ఎం.విమల అనే దాత రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచండి


శంకరమఠం రోడ్డులో ధర్నా చేస్తున్న కలాసీలు


సీతంపేట: కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్లైవుడ్ కలాసీలంతా గురువారం శంకరమఠం రోడ్డులోని ప్లైవుడ్ షాపుల ఎదుట ధర్నా చేశారు. లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్న కలాసీలకు కూలీ రేట్లు పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘ నాయకులు ఎం.మన్మధరావు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ రెండేళ్లుగా ప్లైవుడ్ కలాసీల కూలీ రేట్లు పెంచకుండా యజమానులు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న కూలీ రేట్లు కార్మికుల కుటుంబ పోషణకు ఏమాత్రం చాలడం లేదని చెప్పారు. కూలీ రేట్లు పెంచుతూ అగ్రిమెంట్ చేయకపోతే కలాసీలు పనులు బంద్ చేయడానికి వెనుకాడరని హెచ్చరించారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా


స్టాల్ టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం డ్రా తీశారు. 88 మంది ఉదయం బజార్ కార్డుదారులకు 66 స్టాళ్లు, సాయంత్రం కార్డుదారులకు 59 స్టాళ్లు కేటాయించారు. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో రైతులకు స్టాల్ టోకెన్లు అందజేశారు. ఈవో మట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


వంశీనగర్‌లో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పరిశీలించారు. వంశీనగర్‌లో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, అక్కడ నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఆయన పర్యవేక్షించారు. కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సమయానికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ ప్రసాద్ వెంట ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, అలేఖ్య ఉన్నారు.

పద్య సాహిత్యం అవసరం


మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: ప్రసన్నభారతి ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహిత్య సభ జరిగింది. ప్రసన్నభారతి అధ్యక్షుడు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజాంకు చెందిన గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' విమర్శ గ్రంథానికి, పాల్వంచకు చెందిన అచ్యుతానంద బ్రహ్మచారి రచించిన 'సాందీపని చరిత్ర' పద్యకావ్యానికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ భావితరాలకు తెలుగు భాష సంప్రదాయ సాహిత్యాన్ని, విలువలను అందజేస్తున్న ప్రసన్నభారతి కృషిని ప్రస్తావించారు. రచయితలు డి.వి.సూర్యారావు, బులుసు వెంకటేశ్వర్లు, ప్రసన్న భారతి కార్యదర్శి సర్వేశ్వర ప్రసాద్ పద్య సాహిత్యం వైభవాన్ని, పద్య సాహిత్యాన్ని నిలబెట్టాల్సిన అవసరాన్ని వివరించారు.

రోడ్డెక్కిన మురుగు నీరు


టీపీటీ కాలనీ రోడ్డులో లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని పలు ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు లీకై మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. టీపీటీ కాలనీ, ఎన్ఆర్ఐ హాస్పిటల్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రాంతాల్లో వారానికి ఒకసారి ఈ సమస్య తలెత్తుతోంది. మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు రోడ్డు మీదకు చేరడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాకపోకల సమయంలో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించకపోవడంతోనే మ్యాన్‌హోళ్లు లీకవుతున్నాయని చెబుతున్నారు. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ రాజగోపురానికి మరమ్మతులు


రాట కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు పోలమాంబ ఆలయ రాజగోపురం మరమ్మతులకు గురువారం శ్రీకారం చుట్టారు. నగరానికి చెందిన సిరిమల్ల వెంకటేష్, రాధారాణి దంపతులు రాజగోపురానికి పెయింటింగ్, గోపురంపై విగ్రహాలకు మరమ్మతులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు పనులను గురువారం రాట వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.గాయత్రి, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకరరావు, సభ్యులు మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నందూరి కృష్ణమోహన్, మరడ నాగమణి, మారెడ్ల సత్య వెంకట రమణమ్మ, బిడుమూరి భారతి, అర్చకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్


స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సతీమణి డాక్టర్ నిహారిక

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో గురువారం స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగింది. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఇక్కడ జరగనున్న ఈ స్పోర్ట్స్ మీట్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సతీమణి డాక్టర్ నిహారిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. టార్చ్ బేరర్ చూపుతూ బెలూన్లు, శాంతి కపోతాలు గాలిలో ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ మీట్‌లో సుమారు 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలి రోజు యోగా, ట్రాక్ ఈవెంట్లు, తైక్వాండో, అథ్లెటిక్స్, హులా హోప్స్, జుంబా, డంబెల్స్, బాంగ్రా, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారికా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహం, క్రీడా స్ఫూర్తిని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం


సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయో టెక్నాలజీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో గురువారం మానవ పోషణ-ఆరోగ్యంలో చిరుధాన్యాల పాత్రపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనకాపల్లి అగ్రికల్చర్ రీసెర్చి విభాగానికి చెందిన డాక్టర్ పీవీ జగన్నాథరావు, ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఎస్. అనురాధ పాల్గొని మిల్లెట్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎ. వీరబ్రహ్మం మాట్లాడుతూ పోషకాహార ఉపయోగాలు తెలిసేలా సింపోజియం నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం మిల్లెట్ సంబంధిత ఆహారాన్ని అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, తేజశ్విని, దీపిక, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సేవా వార్డుకు గీజర్ వితరణ


రోగులకు రగ్గులు, మాస్కులు, పండ్లు అందజేస్తున్న జీకే నాయక్

దాబాగార్డెన్స్ : ఒడిశా స్టీవ్‌డోర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కేజీహెచ్ సేవా వార్డుకు గీజర్ పరికరాన్ని, రోగులకు రగ్గులు, మాస్కులు, డైపర్స్, పండ్లు వితరణ చేసింది. ఒడిశా స్టీవ్ డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జీకే నాయక్ వీటిని గురువారం అందజేశారు. వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణాదేవి వితరణగా అందించిన సామగ్రిని స్వీకరించి వార్డు అవసరాలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్లు జగదీష్, ఆనంద్, సాగర్‌బాబుతో పాటు హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్, సభ్యుడు మల్లేశ్వరరావు, రెయ్యి డేవిడ్‌రాజు, హెడ్ నర్స్‌లు మణి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా మాక్ పార్లమెంట్


బుల్లయ్య కళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న బీఏ విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల క్యాంపస్‌లో బీఏ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. విద్యార్థినీ విద్యార్థులు అధికార, ప్రతిపక్ష సభ్యులుగా వ్యవహరించి అసలైన పార్లమెంట్‌లో చర్చా కార్యక్రమాలు ఎలా జరుగుతాయో కళ్లకు కట్టినట్టు ఆసక్తికరంగా చూపారు. బీఏ విద్యార్థులు డి.శ్రీనిధి స్పీకర్‌గా, కె.కుసుమ డిప్యూటీ స్పీకర్‌గా, ఎం.రుక్సార్ బేగం ప్రధాన మంత్రిగా వ్యవహరించగా.. ఎం.నిఖిత, బి.జగదీష్, కె.వి.సాత్విక్, టి.హర్ష శాంతిచంద్ర ప్రతిపక్ష పార్టీ ప్రతినిధులుగా పాల్గొన్నారు. అధికార పార్టీ చంద్రయాన్-3 విజయాన్ని ప్రశంసించడంతో సభ ప్రారంభమైంది. తర్వాత ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, భారత ఎక్సైజ్ పాలసీ, రాష్ట్ర రుణ సమస్య, పార్లమెంట్‌లో భద్రత ఉల్లంఘన, భారత్ కెనడా సంబంధాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, ఆర్‌వీహెచ్ శ్రీకాంత్, సాంఘిక శాస్త్ర విభాగాధిపతి జె.లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగి వైద్యానికి సాయం


చెక్కు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు, నాగరాజు

సీతంపేట: చిరంజీవి కళా పరిషత్ అధ్యక్షుడు గెంబలి జగదీష్ క్యాన్సర్ రోగికి నగదు విరాళం, నిత్యావసర సరకులు అందజేశారు. డాబాగార్డెన్స్‌కు చెందిన పి.లావణ్య క్యాన్సర్ బారిన పడింది. నాలుగో దశలో ఉన్న ఆమెకు వైద్యం చేయించడానికి కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న జగదీష్ సాయం అందించేందుకు ముందుకొచ్చారు.

గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో లావణ్య కుటుంబ సభ్యులకు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కందుల నాగరాజు చేతుల మీదుగా రూ.25 వేల చెక్కు, నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో బయ్యా శ్రీనివాస్, బి.శ్రీనివాస్ పట్నాయక్, ఎస్.శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాసరావు, నవీన్, విశ్వేశ్వరరావు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి


ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి


సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్ : పాతనగంలోని కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు ముత్యాల వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రాత:కాల విశేష అర్చనలు, ప్రత్యేక పూజల అనంతరం 108 సువర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ సంఘ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ప్రతి గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పాలూరి వరప్రసాద్, కొల్లూరు రాము, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పద్ధతుల్లో పాఠ్య బోధన అవసరం


స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని 19 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం సమావేశం నిర్వహించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యా శాఖాధికారి సీహెచ్.రవీంద్రబాబు మాట్లాడుతూ ఎన్ఈపీ-2020 ప్రకారం కొత్త పద్ధతుల్లో పాఠ్యాంశాల బోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ దుర్గాభవాని, కార్యదర్శి వి.విశ్వనాథం, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి తిరుప్పావడ సేవ



ఎంవీపీ కాలనీ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం తిరుప్పావడ సేవ వైభవంగా నిర్వహించారు. వెంకన్న స్వామివారి ఎదుట పులిహోర కుప్పగా పోసి, వడలు నివేదించారు. నిత్యాగోష్టిలో పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదం అందజేశారు.